# చట్టాలున్నా.. చైతన్యం రావాలి!!

**ప్రాచీన కాలం నుంచే వ్యభిచారం కొనసాగుతున్నట్లు చరిత్ర చెబుతోంది. క్రీ.పూ.18వ శతాబ్దంలో హమ్మురబి స్మృతి... మెసపొటేమియాలో మహిళల హక్కులను ప్రస్తావిస్తూ... వ్యభిచారిణుల రక్షణకు సంబంధించిన అంశాలను వివరించింది. అలాగే (సుమేరియన్లు) బాబెలోను పట్టణంలో నివసించే మహిళలు.. అక్కడి గుడిని సందర్శించడానికి వచ్చే విదేశీయులకు లైంగికపరంగా ఆతిథ్యం ఇవ్వాలనే ఆచారం ఉండేది. ప్రాచీన ఇజ్రాయిల్ రాజ్యంలో వ్యభిచార వృత్తి కొనసాగేది. అలాగే దక్షిణ అమెరికాలోని అజ్‌టెక్ తెగవారు మహిళలు వ్యభిచార వృత్తిని కొనసాగించడంలో తప్పులేదని భావించేవారు. పురాతన గ్రీసు దేశంలో మహిళలు, పిల్లలు వ్యభిచార వృత్తిని సాగించేవారు. రోమ్ సామ్రాజ్యంలో శత్రు దేశాలకు చెందిన మహిళలను చెరపట్టి, బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి దించేవారు.**

**భా**రతదేశంలో క్రీ.పూ.2వ శతాబ్దంలో శూద్రకుడు ''మ్రిచ్ఛకటిక'' అనే నాటికను వ్యభిచారం ఇతివృత్తంగా చేసికొని రాసాడు. మధ్య యుగ కాలంలో దేవదాసీ వ్యవస్థ కొనసాగింది. ప్రముఖ దేవాలయాల్లో దేవదాసీలుండేవారు. వీరికి ఆ గుడి ప్రధాన దేవతతో వివాహం జరిగేది. ఆ తర్వాత వాళ్లు ఆజన్మాంతం ఆ గుడిలో దైవ సేవ చేస్తుండేవారు. భారత ఉపఖండంపై పశ్చిమ ఆసియా నుంచి దాడులు పెరిగి, అనేక దేవాలయాలను కొల్లగొట్టడంతో... దేవదాసీ వ్యవస్థ క్రమేణా బలహీనపడింది. దాంతో సరిపడ ఆదాయంలేక ఈ దేవదాసీలు వ్యభిచార వృత్తిలోకి మారారు.

## ఇతర దేశాల్లో :

16, 17 శతాబ్దాల్లో ఐరోపా దేశాలు వ్యభిచార వ్యవస్థ పట్ల కఠిన వైఖరిని అనుసరించడం ప్రారంభించాయి. ఇందుకు ప్రధాన కారణాలు... రెండు. ఒకటి, క్రైస్తవుల్లో ప్రొటెస్టంట్ ఉద్యమంతో ప్రారంభమైన సంస్కరణలు; రెండు, నేపుల్స్ పట్టణంలో సిఫిలిస్ అనే లైంగిక వ్యాధి ప్రబలి, కొన్ని వేల మంది మరణించడం; ఈ సిఫిలిస్ వ్యాధి అక్రమ లైంగిక సంబంధాల వల్ల వ్యాపించింది. 18వ శతాబ్దంలో ప్రపంచంలోనే మొదటిసారిగా వెనిస్ పట్టణంలో కండోమ్‌ల వాడకం మొదలైంది. 19, 20 శతాబ్దాల్లో... వ్యభిచార వృత్తిని కొన్ని దేశాలు చట్టబద్ధం చేస్తే... మరికొన్ని దేశాలు నిషేధించాయి. నెదర్లాండ్స్‌లో వ్యభిచార వృత్తికి సంబంధించిన ప్రకటనలు చట్టబద్ధమైతే... జర్మనీలో అలాంటి ప్రకటనలు నిషిద్ధం.

అమెరికా (నెవడా రాష్ట్రం మినహా), ఫ్రాన్స్, కెనడా, బ్రిటన్ వ్యభిచార వృత్తిని నిషేధిస్తే... స్వీడన్, నార్వే, ఐస్‌లాండ్ దేశాలు సరళీకృత విధానాన్ని అవలంబిస్తున్నాయి. ఈ దేశాల్లో వ్యభిచారిణులను శిక్షించరు. కాని కక్షిదారులను (Clients) శిక్షించడానికి అవకాశముంది.

నెదర్లాండ్స్, జర్మనీల్లో ఈ వృత్తిని నియంత్రిస్తున్నారు. న్యూజిలాండ్‌లో మాత్రం వ్యభిచార వృత్తిపై ఎలాంటి నిషేధం లేదు. భారత్‌లో వ్యభిచారం చట్టరీత్యా నేరంకాదు. దానికి సంబంధించిన కార్యకలాపాలు (వ్యభిచార గృహాలను నిర్వహించడం, తార్పుడు వృత్తిని చేపట్టడం, బహిరంగంగా మహిళలు, పురుషులను లైంగిక చర్యలకు ప్రోత్సహించడం) మాత్రం చట్ట విరుద్ధం.

ప్రపంచవ్యాప్తంగా మహిళలను,పిల్లలను బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి దించుతున్నారు. ప్రధానంగా థాయ్‌లాండ్, జపాన్, ఇజ్రాయిల్, బెల్జియం, నెదర్లాండ్స్, జర్మనీ, ఇటలీ, టర్కీ, అమెరికాలకు వీరిని బలవంతంగా తరలిస్తున్నారు. ఈ బలవంతపు క్రయ, విక్రయాలకు (trafficking) గురవుతున్న మహిళలు, పిల్లల్లో ఎక్కువ శాతం మంది థాయ్‌లాండ్, చైనా, నైజీరియా, అల్బేనియా, బల్గేరియా, బెలారస్, మోల్డోవా, ఉక్రెయిన్ జాతులకు చెందినవారు. దీనికి పేదరికం, అంతర్యుద్ధం ప్రధాన కారణాలు. ప్రతిఏటా దాదాపు 8,00,000 మందిని బలవంతంగా వ్యభిచారం, వెట్టిచాకిరి కోసం ఇతర దేశాలకు విక్రయిస్తున్నారు. వీరిలో 80 శాతం మహిళలు, పిల్లలు. కంబోడియా, థాయ్‌లాం డ్‌లు బాలల వ్యభిచార వృత్తికి కేంద్రాలయ్యాయి.

వ్యభిచార వృత్తి ప్రస్తుతం ప్రధానంగా కింది రూపాల్లో కొనసాగుతోంది:

- బహిరంగ ప్రదేశాల్లో విటులను ఆకర్షించడం.
- కాల్‌గర్ల్స్ ఎస్కార్ట్ ముసుగులో వ్యాపారం సాగించడం.
- లైంగిక పర్యటనల పేరుతో సంపన్న దేశాలకు చెందినవారు.. వర్ధమాన దేశాలకు పర్యాటకుల వేషంలో వచ్చి ఈ అవినీతి పనులకు పాల్పడటం.

విచ్చలవిడిగా శృంగార కార్యకలాపాల్లో పాల్గొనడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా హెచ్ఐవీ/ఎయిడ్స్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. దీనిపై పారిశ్రామిక దేశాలు, ఐక్యరాజ్యసమితి లాంటి అంతర్జాతీయ వ్యవస్థలు స్పందించి... ప్రజల్లో ఈ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడానికి ప్రయత్నించడం.. సురక్షిత లైంగిక కార్యకలాపాల ఆవశ్యకతను ప్రచారం చేయడం లాంటి చర్యలు చేపట్టడంతో వ్యభిచార వృత్తిని కొంతవరకు నియంత్రించడానికి వీలయింది. కొన్ని దేశాల్లో ఈ

SAKSHI

వ్యవస్థను పూర్తిగా నిషేధిస్తూ... కఠినమైన చట్టాలను అమల్లోకి తెచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు, బిల్‌గేట్ ఫౌండేషన్ లాంటి సంస్థలు కండోమ్‌ల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాయి. వ్యభిచార వృత్తిలో ఉన్నవారు విధిగా రిజిస్టర్ చేయించుకోవడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవడం లాంటి నిబంధనలను చాలా దేశాలు అమలు చేస్తున్నాయి.

## కారణాలు :

వ్యభిచార వృత్తి కొనసాగడానికి రెండు ప్రధాన కారణాలు...

- ఆ రంగాన్నికున్న డిమాండ్
- ఆ వృత్తిలోకి బలవంతంగా దిగినవారి దుర్బల స్థితి.

ఈ వృత్తిలో చేరడానికి దారిద్ర్యం మాత్రమే కారణం కాదు. తమకున్న హక్కులపట్ల సరైన అవగాహన లేకపోవడం.. హక్కులను వినియోగించుకునే అవకాశం లేకపోవడం.. నిరక్షరాస్యత.. ఆదాయం లో వ్యత్యాసాలు.. చట్టాల అమల్లో నిర్లిప్తత, అవినీతి మయమైన పోలీసు యంత్రాంగం.. వ్యభిచార గృహాలను నిర్వహించే వారికి మాఫియా, రాజకీయ శక్తుల అండ.. సమాజంలో సరైన చైతన్యం లేకపోవడం.. హక్కుల ఉల్లంఘన పట్ల మౌన సంస్కృతి (culture of silence) మొదలైనవి ముఖ్య కారణాలు. భారత రాజ్యాంగం లోని 23వ ప్రకరణ కింద మానవుల క్రయ, విక్రయాలు నిషేధించారు. దాంతోపాటు అవినీతి కార్యకలాపాల కోసం జరిగే క్రయ, విక్రయాల ను నిషేధిస్తూ 1956లో చట్టం తెచ్చారు. వెట్టిచాకిరి నిషేధ చట్టం, బాలల న్యాయ చట్టం, భార తీయ నేరస్మృతిలోని వివిధ నిబంధన లు... వ్యభిచార వృత్తిని నియంత్రించేందుకు ఉద్దేశించారు.

ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరికొన్ని చర్యలు చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ''ఉజ్వల'' అనే ఒక సమగ్ర కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ముఖ్య లక్ష్యం: వ్యభిచార వృత్తి నుంచి మహిళ లకు, బాలలకు విముక్తి కలిగించడంతోపాటు సమాజంలో వారు తిరిగి గౌరవప్ర దమైన జీవితాన్ని గడపడానికి వీలుగా పునరావాస సౌకర్యాలు కల్పించడం. కేంద్ర, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖలు, ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థలు ఈ దిశగా కృషి చేస్తున్నాయి. సామాజిక అప్రమత్తత, చొరవతో ఇది సాధ్యమే. ఈ ప్రయత్నంలో 2007 సంవత్సరం ఒక నూతన శకాన్ని ప్రారంభించిదనవచ్చు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం... మానవ క్రయ, విక్రయాల నిరోధక విభాగాన్ని (Anti Human Trafficking Unit)హైదరాబాద్, అనంతపూర్, ఏలూరుల్లో ప్రారంభించింది. గోవా, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలు కూడా ఈ వ్యవస్థను ఏర్పాటు చేశాయి. ఈ విభాగం అధిపతి డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్ స్థాయి అధికారి. పోలీస్ సిబ్బంది, సంబంధిత ప్రభుత్వ వ్యవస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థల సహాయం తో.. ఈ అసాంఘిక కార్యకలాపాల్ని పటిష్టంగా అడ్డుకోవడం, ఈ కూపంలోకి బలవంతంగా దిగిన వారికి పునరావాసం కల్పించడం జరుగుతుంది. ఇది సామాజిక చైతన్య వేదికగా, సుపరిపాలనకు దోహదకారిగా పని చేస్తుంది. అయితే, ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే... పోలీసు యంత్రాంగంలో చిత్తశుద్ధి, రాజకీయ మద్దతు, సామాజి క స్పృహ, స్వచ్ఛంద సేవా సంస్థల అంకితభావం అవసరం.

ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాన్ని సవరించడం కోసం 2006 లో పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం– వ్యభిచారి ణులు లైంగిక కార్యకలాపాలను ప్రోత్సహించడం నేరం కాదు. అయితే, ఆ చర్యలో పాల్గొనే పురుషులు శిక్షార్హులు. దీన్ని మహిళా సంఘాలు, వ్యభిచార వృత్తిలో జీవనాధారం పొందేవా రు తీవ్రంగా ప్రతిఘటించారు. ఎందుకంటే... దీనివల్ల ఈ వృత్తి లోని అనేక మంది జీవనోపాధిని కోల్పోతారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఆ అంశాన్ని తొలగించింది. లక్షలాది మంది మహిళలకు ఈ వృత్తి జీవనోపాధి కలిగిస్తుందనేది నిర్వివాదాంశం. పేదరికం, అత్యాచారం, భర్తలు వదిలేయడం, లేదా చెడు వ్యసనాలకు లోనై భార్యలను బలవంతంగా వ్యభిచారంలోకి దించడం జరుగుతోంది.

ఈ వృత్తిలో ఎన్నో ఇబ్బందులున్నప్పటికీ.. సమాజం చిన్న చూపు చూస్తున్నప్పటికీ ఎంతోమంది ఈ జీవన విధానాన్ని ఎంచుకోవడానికి రెండు ప్రధాన కారణాలున్నాయి.

- వీరిలో ఎక్కువ మందికి సంఘటిత రంగంలో జీవనోపాధిని పొందడానికి అవసరమైన విద్య, వృత్తిపరమైన నిపుణత లేదు. కూలిపని ద్వారా లభించే వేతనం కుటుంబ ఖర్చులకు సరిపోవడం లేదు. దాంతో అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవడానికి తప్పనిసరి పరిస్థితిలో ఈ వృత్తిలోకి దిగుతున్నారు.

- వ్యభిచారానికి సమాజం ఆపాదించే కళంకం ఎంత తీవ్రమైందంటే... వీరికి మిగతా రంగాల్లో జీవనోపాధి లభించడం కష్టం. ఇంతకుముందు ఈ వృత్తిలో కొనసాగిన విషయం తెలిసి.. వారిని ఉద్యోగంలో నుంచి తొలగించడం, లేదా హేళన చేయడం, లేదా లైంగిక వేధింపులకు గురి చేయడం జరుగుతుంది. ఈ వృత్తిలో ఎక్కువ శాతం మంది షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలే. పేదరికం, సామాజిక హోదా చాలావరకు ఈ దీనస్థితికి కారణం.

## దీనికి పరిష్కారమేది?

ప్రపంచంలో ఎక్కడా లేనంత భారీ స్థాయిలో... దక్షిణాసియాలో ఈ అనైతిక, సాంఘిక దురాచారం కొనసాగుతోంది. ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ– మాదకద్రవ్యాలు, నేరాల నిరోధక కార్యాలయం దీన్ని అరికట్టడానికి కృషి చేస్తోంది. దీని ప్రతినిధి 'గారీలూయా' అభిప్రాయపడినట్లు... ''పేదరికం, లింగపరమైన వివక్ష, వనరులు అందరికి సమానంగా అందుబాటులో లేనంత కాలం ఈ దారుణ పరిస్థితి కొనసాగుతుంది''. అనైతిక కార్యకలా పాల నిరోధక చట్టం అంతంత మాత్రంగానే అమలవుతోంది. నేర పరిశోధన ప్రభావంతం గా లేదు. సాక్షులకు, బాధితులకు తగిన రక్షణ లేదు.

భారత ప్రభుత్వం రూపొందించబోయే నూతన చట్టం సమ

గ్రంగా అన్నిరకాల అత్యాచారాలు, దోపిడి, హింసలను దాని పరిధిలోకి తీసుకురావాలి. ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యవస్థల మధ్య సహకారం, అవగాహన పెరగాలి. వీటన్నింటికంటే – పేద ప్రజలు ముఖ్యంగా మహిళలకు సామాజిక, ఆర్థిక,విద్యా రంగాల్లో సాధికారత కల్పించాలి. పురుషుల వైఖరి కూడా మారాలి. మహిళలను కేవలం తమ లైంగిక వాంఛలకు ఒక సాధనంగా పరిగణిస్తూ... వారికి ఇష్టాయిష్టాలుంటాయని గుర్తించనంత కాలం ఈ దురాచారాన్ని నిర్మూలించడం కష్టం. పురుషాధిక్య సమాజంలో మహిళలకు న్యాయం లభించడం దుర్లభమేమో!!

- 16,17 శతాబ్దాలలో ఐరోపా దేశాలు వ్యభిచార వ్యవస్థ పట్ల కఠిన వైఖరిని అనుసరించడం ప్రారంభించాయి.
- భారత్‌లో వ్యభిచారం చట్టరీత్యా నేరం కాదు. దానికి సంబంధించిన కార్యకలాపాలు (వ్యభిచార గృహాలను నిర్వహించడం, తార్పుడు వృత్తిని చేపట్టడం,బహిరంగంగా మహిళలు, పురుషులను లైంగిక చర్యలకు ప్రోత్సహించడం) మాత్రం చట్ట విరుద్ధం.
- భారత రాజ్యాంగంలోని 23వ ప్రకరణ కింద మానవుల క్రయ విక్రయాలను నిషేధించారు. దాంతోపాటు అవినీతి కార్య కలాపాల కోసం జరిగే క్రయ,విక్రయాలను నిషేధిస్తూ 1956లో చట్టం తెచ్చారు. వెట్టిచాకిరి నిషేధ చట్టం,బాలల న్యాయ చట్టం, భారతీయ నేరస్మృతిలోని వివిధ నిబంధనలు.. వ్యభిచార వృత్తిని నియంత్రించేందుకు ఉద్దేశించారు.
- కేంద్ర ప్రభుత్వం ఇటీవల 'ఉజ్వల' అనే ఒక సమగ్ర కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ముఖ్య లక్ష్యంః వ్యభిచార వృత్తి నుంచి మహిళలకు, బాలలకు విముక్తి కలిగించడంతో పాటు సమాజంలో వారు తిరిగి గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి వీలుగా పునరావాస సౌకర్యాలు కల్పించడం.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. మానవ క్రయ,విక్రయాల నిరోధక విభాగాన్ని హైదరాబాద్, అనంతపూర్, ఏలూరుల్లో ప్రారంభించింది.

SAKSHI